# ఓ హ హ

ఆవిడ కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం తిరగేస్తున్నది. మహీధర్ శిలాప్రతిమలా నిశ్చలంగా ఆవిడకేసి చూస్తూ కూర్చున్నాడు. మహీధర్ మనసులో ఏదో కల్లోలంగా ఉంది. మబ్బుకమ్మిన చంద్రుడిలా ఉన్నది మహీధర్ ముఖం.

కలువ రేకుల్లాంటి కళ్లు, సంపంగిలాంటి ముక్కు, ముత్యాల్లాంటి పలువరుస... ఇంకా ఏమిటేమిటో వర్ణిస్తారు, అందమైన ఆడవాళ్ళను గూర్చి. మహీధర్‌కు కవిత్వం రాకపోయినా ఆవిడను చూసిన క్షణంలో ఎప్పుడెప్పుడో పుస్తకాల్లో చదివి మర్చిపోయిన అందకత్తెల తాలూకు వర్ణనలన్నీ ఒకసారి స్మృతిపథంలో మెరిశాయి.

మిస మిసలాడే పసిమివర్ణంతో ఆవిడ ఎంతో నాజూకుగా సుందరంగా వుంటుంది. ఆమె కేవలం సౌందర్యవతి మాత్రమే కాదు. విద్యావతి కూడా. పసిడికి పరిమళ మబ్బిన చందాన ఆవిడ చదువు ఆవిడ రూపురేఖలకు మరింత అందాన్ని తీసుకువచ్చాయి. మహీధర్ ఆవిడ అందానికి ముగ్ధుడయ్యాడు. చదువుచూసి మురిసిపోయాడు. ఎంతపుణ్యం చేసుకోకపోతే అంత చదువుకున్న చక్కని చుక్క భార్యగా లభిస్తుందని పదే పదే తన అదృష్టాన్ని పొగడుకున్నాడు. నిజానికి మహీధర్ మహామేరువు దొరికినట్టు మహదానంద భరితుడయ్యాడు.

కాని అంత ఆనందంలోనూ అతనికేదో అసంతృప్తి, వెలితి కన్పిస్తున్నది.

అంత అందమైన అమ్మాయికి అందమైన పేరుంటే ఎంత బాగుండేది! కాకపోయినా యింత అసహ్యమూ, దుర్భరమైన పేరు ఉంటుందని ఎవరైనా ఊహించగలరా? ఆ అందకత్తె పేరు నరసమ్మ! చిక్కని పాలల్లో విషపు చుక్క ఒలికినట్టుంది! అది తలచుకుంటేనే మహీధర్‌కు మతిపోతున్నది. ఉల్లాసానికి బదులు మనసు కల్లోలంగా ఉంది.

అందమైన అమ్మాయికి అందమైన పేరు పెట్టుకోకూడదూ? అదేంమాట! అందంగా లేనివాళ్లకైనా అదేం పేర్లు? చూడటానికి బాగోకపోతే పేరైనా వినటానికి ఇంపుగా వుండొద్దూ? నిజానికి ఆడవాళ్లకి అందమైన పేర్లు యెన్నెన్నో — కొల్లలు కొల్లలు — అదృష్టవశాత్తు తనకి మంచిపేరు పెట్టినా ఒకోపేరు వింటే మహీధర్‌కు తను ఆడపిల్లై పుట్టలేదే అని విచారంగా వుంటుంది. ఎంచి, ఎంచి యెంత మంచిపేరు పెట్టారు — నరసమ్మ — నరసమ్మ.

మహీధర్‌కు భరించరానంత ఏవగింపుగా వుంది. మహీధర్ చేత్తో చిటికె వేశాడు. ఆవిడ తలెత్తిచూసింది.

"నీ పేరు అంత అసహ్యంగా ఉందేమిటి?" అడిగాడు మహీధర్ సంజాయిషీ చెప్పాలో మన్నట్టు ఆవిడకేసి దీర్ఘంగా చూస్తూ.

ఆవిడ ఓక్షణం మహీధర్ ముఖంకేసి మెల్లిగా తల దించేసుకుంది.

"పోనీ - ఏమని పిలవమంటావో చెప్పు?"

"బాగుంది - అందరూ పిలిచినట్టే నరసూ అనండి" అండావిడ సన్నగా నవ్వుతూ.

"నర్సూ, డాక్టర్! ఆ పేరింక నా దగ్గరెత్తకు-యాక్-ఛీ-తలచుకుంటేనే పరువు తక్కువ. పైగా పిలవటం కూడానా?" అంటూ ముఖం చిట్లించుకున్నాడు మహీధర్.

అసహ్యంతో అష్టవంకర్లుగా మారిన మహీధర్ ముఖం చూసి ఆవిడ మెల్లగా నవ్వింది.

"నన్నేం చెయ్యమంటారు చెప్పండి! మా నాయనమ్మ పేరని వాళ్ళెంతో ముచ్చటపడి పెట్టుకున్నారు మరి..."

"ఏం నాయనమ్మో! అందరూ ఎంత నవ్వుతున్నారో నీకేం తెలుసు! నాకు నిజంగా తలకొట్టేసినట్టుంది. సిగ్గు—సిగ్గేస్తున్నది. నువ్వు మాత్రం ఏం పట్టనట్టు కూర్చున్నావ్!" అన్నాడు మహీధర్ మండిపాటుగా.

"మార్చి నీకే పేరు నచ్చిన పేర్లుంది!" రెట్టించాడు.

"బాగానే వుంది. నాకు నచ్చటమేమిటి? ఆ మాటలొస్తే నాకే కాదు. ఎవరికీ నచ్చదు. మీనా, బీనా లాంటి చక్కచక్కటి పేర్లతో నాకూ మనసు లేకపోలేదు." అండావిడ నిరాశ ప్రతిధ్వనిస్తున్న కంఠంతో.

మహీధర్ నవ్వాడు.

"అయ్యో రామా! అంతదాకా ఎందుకు? సీత, సావిత్రి, దమయంతి-వగైరా పురాణాల్లోని పేర్లు పెట్టుకున్నా ఇంతకంటె బాగుండును కదా? ఫ్యాషనుగా లేని పాత పేర్లనుకో అయినా ఈ నరసమ్మ, వెంకమ్మ, పుల్లమ్మలా సిగ్గుచేటుగా లేవుగా ఇన్ని మంచిపేర్లు వుండగా వాటి జోలి కెందుకెళ్ళాలో? అసలు వాటిని నిషేధిస్తే బాగుండును." అన్నాడు మహీధర్ కసిగా.

ఆవిడ కిలకిలా నవ్వింది. గలగల పారే సెలయేటి శబ్దంలా తీయగా వినిపించింది మహీధర్‌కి.

"పోనీ-ఓ చదువూ, సంధ్యాలేని పిల్లఅలాంటి పేరు పెట్టుకున్నదంటే అదో దారి. అంతేగాని—బి. ఏ. చదువుకున్న అమ్మాయి పేరు నరసమ్మ! ఎంత ఎబ్బెట్టుగా వుందో చూడు! కాదు కానీ—ఈ పేరుతో కాలేజీలో కూడా ఎలా చదువుకొచ్చావ్? రామ రామ! నాకే సిగ్గేస్తున్నది. నేనైతే చదువైనా మానేసే వాడిని కాని— అలాంటి పేరుతో అందరిలో తలెత్తుక తిరగటమే! నిజం చెప్పు! కాలేజీలో—అందులో—అందరి మొగాళ్ళముందూ నీకు చిన్నతనం వేసేది కాదూ?" అని అడిగాడు మహీధర్, ఆవిడ సిగ్గుతేనితనానికి మహాశ్చర్య పడుతూ.

"నయం నా పేరు ఆడపేరులాగన్నా వుంది మా క్లాసులో యింకో అమ్మాయి వుండేది. ఆ పిల్ల పేరు బాలకృష్ణ ఆ పేరు విని లెక్చరర్‌తో సహా అంతా విరగబడి నవ్వారు. మరి నా పేరు నయమేనంటారా, కాదంటారా?" అండావిడ కొంటెగా నవ్వుతూ.

మహీధర్ మరి కాస్త ఆశ్చర్యపోతూ యిలా అన్నాడు. "మైగాడ్! ఇది మరీ ఘోరంగా వుంది! అందమైన ఆడ పేర్లన్నీ వదిలిపెట్టుకుని బాలకృష్ణని, బండ కృష్ణని మొగ పేర్లమీద పడటమెందుకు? మొత్తానికి రెండూ రెండేలే. ఆడ పేరైతే మాత్రం ఏం ముచ్చట! ఆడ పేరా—అధ్వాన్నం పేరా! నిజంగా—ఈ పేరు బొత్తిగా బాగోలేదు. నువ్వు తక్షణం మార్చుకోకపోతే...!"

మందరపు పద్మ, లలిత

వాక్యం పూర్తి చేయకుండానే ఆపేశాడు మహీధర్.

"ఏం చేస్తారు?" ప్రశ్నించిందావిడ ముత్యాల్లాంటి పలువరుస కనిపించేటట్లు నవ్వుతూ

మహీధర్ సమాధానం చెప్పకుండా "అందులోనూ నాపేరు మహీధరైనప్పుడు – చూడు నరసమ్మ మహీధర్ అంటే పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వు రావటంలేదూ?" అన్నాడు సీరియస్‌గా.

ఆవిడకు మహీధర్‌ను మరికాస్త ఉడికించాలని బుద్ధి పుట్టింది

"మీది మరీ చిత్రం, ఎందుకు నవ్వుతారు లెద్దురూ? మా ప్రిన్సిపాల్ పేరేమో రంగధామారావు, ఆవిడ పేరేమో పేరమ్మ. అయితేనేం - పేరమ్మ రంగధామారావు అనడం లేదూ అంతా ఆవిడని? మీలా నవ్వుతూ కూర్చుంటున్నారా?" అంది ఆవిడ నవ్వుతూ కొంటెగా.

మహీధర్ మాత్రం ఆ పేరు పదే పదే అనుకుంటూ నిజంగా కాస్సేపు నవ్వుకుంటూనే కూర్చున్నాడు.

మరుక్షణంలో మహీధర్ భరింపరాని బాధపడుతున్న వాడిలా గట్టిగా మూల్గాడు.

"హు! మంచిపోలిక తెచ్చావ్! బి. సి నాటివాళ్ళు అలాంటి పేర్లు పెట్టుకున్నారంటే క్షమించవచ్చు కాని.. ఇప్పటి ఎడ్యుకేటెడ్ వాళ్ళుకూడా ఈ పేడమ్మ, పిడకమ్మలను పుట్టుకు ప్రాకులాడుతూంటే-హు-వాళ్ళనెలా క్షమించటం? ఉహు! నువ్వు చక్కని పేరు పెట్టుకోవాలి! మహీధర్! ఎంత చక్కటిపేరు! చిత్రం కాకపోతే...దానికి పరిహారంలావుంది నీపేరు." అని నిట్టూర్చాడు మహీధర్.

"అక్కడేవుంది తమాషా అంతా. మా మీనా మొగుడిపేరు ఆంజనేయులు. మీనా ఎంత చక్కటి పేరు మరి! ఆంజనేయులంటే తోక-ఎత్తుమూతి జ్ఞాపకంవచ్చి నవ్వు రాదటండీ? అందరూ 'మనిషికూడా ఆంజనేయుల్లానే వుంటాడా?' అని ఒకటే విరగబడి నవ్వితే అది అసలే సిగ్గుపడుతున్నదేమో, మరికాస్త సిగ్గుపడిపోయి మొగుడికి మెల్లిగా నచ్చచెప్పి ఆఖరికి పేరు మార్పించేసింది."

"ఏమని మార్చుకున్నాడేం" అని అడిగాడు మహీధర్ ఆతృతగా.

"మీరు చెప్పుకోగలరో లేదో చూడాలి! నేను చెప్తే ఎలా?" అంది చిలిపిగా.

"వాళ్ళమ్మ కతను కడుపులో వుండగా కోతి కలలో కనిపించాడట. దాంతో ఆ పేరు పెట్టేశారతనికి. ఆ పేరు మార్చుకుంటే ఏం పాపమోనని అతను కొద్దిగా తటపటాయించాడు కూడా. మీనా మాత్రం యింతెత్తు ఎగిరింది 'డామిట్! కోతి కనుపించిందని కోతిపేరు, పాము కనుపించిందని పాము పేరు పెట్టేసుకోవడమేనా ఏమిటి అందం చందం లేకుండా' అని, మీనా ఎంతెంత మంచి పేర్లు సెలక్టు చేసిందనుకున్నారు!" అందావిడ కళ్ళు పెద్దవిచేస్తూ.

"అయ్యో! పాపం! చాలా కష్టపడిపోయిందిలే" అన్నాడు మహీధర్ మూతివంకరగా తిప్పి నవ్వుతూ.

"కష్టం కాదుటండీ మరి! ఎన్ని పేర్లు చెప్పినా అతను పెదవి విరచటమే! మధుసూదన్ అని పెట్టుకోమంటే 'ఇదేం పేరు ధన్-ఛన్-దభేల్‌మని పడిపోయినట్టుంది' అని ఒకటే వెక్కిరింపు పోనీ గిరిధర్ నచ్చిందా అంటే అదీ లేదు. 'గిరి' అని వస్తే అతని తల గిర్రున తిరుగుతుందట. ఇలా ఎంతెంత మంచిపేర్లు తోసిపారేశాడనుకున్నారూ? చివరకు అతను 'పోనీ! ఆంజనేయులకి అందమైన పేర్లేమైనావుంటే చూడు' అని చెప్పాడట. మీరు చెప్పండి చూద్దాం. తెలుగులో ఎంత పండితులో ఈ దెబ్బతో తెలిసిపోతుంది" అందావిడ పకపక నవ్వుతూ

మహీధర్ ఒక నిమిషం మౌనం దాల్చాడు.

"కోతి, తిమ్మన, వానరం - ఇవి మినహాయించుకుంటే ఆంజనేయులుకి ప్రత్యేకంగా ఇంక ఒక్క హనుమంతుడనేకదూ వుంటా? ఈ పేరు ఆంజనేయులకంటె ఏం తీసిపోదు మరి?" అని నవ్వాడు మహీధర్.

"ఇంతలోవుంది తెలివి" అని నవ్విందావిడ.

"నేను 'అంజనీ కుమార్' అని పెట్టుకోమని చెప్పాను. అది నచ్చలేదతనికి!' 'అదేమిటి! ఆడపేరుకి కుమార్ తగిలించేశారు! అందరూ 'అంజనీ, అంజనీ' అని ఆడపేరెట్టి పిలుస్తే నాకు ఒళ్ళు చచ్చినట్టుంటుంది సుమండీ' అని అతనంటే మీనా ఒకటే పగలబడి నవ్వింది ఆఖరికి ఆలోచించగా మీనాకే తట్టింది మంచిపేరు. అనిల్ కుమార్! అందానికి అందం, అర్థానికి అర్థం రెండూ కలిసివచ్చాయి, బాగుంది కదండీ?"

"సరే - అందంగానూ వుంది, అతనికి తెలివిగా తప్పింది మరింక పాపమూ అతనికి అంటుకోదులే." అని నవ్వాడు మహీధర్.

"సరే! వాళ్ళ గొడవలోపడి అసలు విషయం అడుగున పడిపోయింది. ఇంతకీ నువ్వే పేరు పెట్టుకుంటావో చెప్పు?" అని లాలనగా అడిగాడు మహీధర్.

"నేనింతవరకూ ఆలోచించందే! మీరేమైనా సజెస్ట్ చెయ్యండి. బాగున్న పేరు పెట్టుకుంటాను." అంది ముద్దులొలికిస్తూ ఆవిడ.

మహీధర్ ఆలోచన కుపక్రమిస్తూండగా ఆవిడ హఠాత్తుగా "ఇలా నిమిషాలమీద ఆలోచిస్తే కుదరదు. రేపటికి బాగా ఆలో










చించి మంచి మంచి పేర్లన్నీ ఒకచోట రాసిపెట్టండి. నేనుకూడా యీలోపల ఆలోచిస్తాను. మంచిపేరు పెట్టుకోవాలిగా మరి, అదరాబాదరా పెట్టేసుకుంటే ఎలా?" అంది మర్చిలోంచి లేస్తూ.

మహీధర్ తలూపాడు.


"శేష్! బాగా చెప్పావు! నాదగ్గిర బోలె డన్ని పుస్తకాలున్నాయి. వాటిలోని పేర్లూ, నాకు తెలిసిన పేర్లూ అన్నీ ఒకచోట రాసిపెడతాను. నువ్వుకూడా మంచి మంచి పేర్లు జ్ఞాపకం చేసుకుంటూ వుండు"

పిల్లలు పుట్టబోయే ముందుకాని, పుట్టేక కాని భార్యాభర్తలు పేర్లకోసం హైరానా పడటమంటూ వుంది. కాని, పెళ్ళానికే నామకరణం చేయాల్సి వస్తుందని ఎవ్వరనుకోగలరు? ఏంచేయటం? మహీధర్ అదృష్టం అలానే వుందిమరి!

మహీధర్ పుస్తకాలన్ని గాలించిగాలించి పేర్లన్నీ చక్కగా ఓ పెద్ద లిస్టు తయారు చేశాడు. మహీధర్ లిస్టుతో దగ్గరకురాగానే అవిడ నవ్వింది.

"రెడీ?"

"ఆఁ రెడీ!" అని సిద్ధంగా కూర్చుంది.




బహుమతి రు. 500
(గవర్నమెంటు రిజిస్టర్డు)
తెల్ల వెంట్రుకలను పోగొట్టును
రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మాసువాసనగల "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి దగ్గిరా కన్నుల రానీయదు. "జ్ఞాపక శక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 3-8-0; 3 సీసాలు రు 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు 18/- లు ఇది పనిచేయుటలేదని నిరూపించిన రు. 500/-
GENERAL LABORATARIES,
(M. O) P. O. Raidhanwar (H. Bag h).

మహీధర్ కాయితాన్ని అవిడ ముందుకు తోశాడు.

"నీకు నోటితో చెప్పదు రూ?" నేనవన్నీ చూడలేను" అందావిడ బద్ధకంగా కాగితాన్ని వెనక్కి నెట్టుతూ.

"ఒకే అక్షరంగల పేరు-శ్రీ-" అన్నాడు అవిడకేసి పరిశీలనగా చూస్తూ.

అవిడ పకపకా నవ్వింది: "ఒక అక్షరంతో పేరేమిటండీ ఎక్కడా వినలేదు. శ్రీమతి అనో, శ్రీదేవనో పెట్టుకుంటారు గాని.. శ్రీ! స్త్రీ అని పెట్టుకుంటే మరీ బాగుంటుంది!"

"శ్రీ అంటే లక్ష్మి. లక్ష్మి అని పెట్టుకున్నప్పుడు శ్రీ అనిపెట్టుకుంటే తప్పేం?" అన్నాడు మహీధర్ హాస్యధోరణిలో.

"తప్పో, ఒప్పో నా కవన్నీ తెలీదు. నాకు బాగోలేదు. సరా! ఊఁ! ఇంకా చెప్పండి."

"రెండక్షరాల పేర్లు బోలెడన్ని. వీణా..." కుతూహలంగా చూశాడు మహీధర్.

"ఆ! బాగుంది! ఇంకా ఫిలేలు, హోర్మోనియం అని పెట్టుకోమన్నారుకాదు" అంది వెక్కిరింపుగా మూతి తిప్పుతూ.

"వాణీ, మీనా, లత, ఆశా..."

అవిడ ముఖం చిట్లించుకుని తల అడ్డంగా తిప్పింది.

"అబ్బబ్బ! ఎక్కడ విన్నా ఇవే కొత్త కొత్త పేర్లూ, సాధారణంగా ఎవరూ పెట్టుకోనివి చెప్పండీ" అంది.

"కొత్త కొత్త పేర్లా-వూ-ఉండు చెప్తా- ఆ-హీరా! హీరా! అందంగా లేదూ! సాధారణంగా ఎవరూ పెట్టుకోరుకూడా" అంటూ మహీధర్ ఆత్రతగా చూశాడు

అవిడకు నవ్వొచ్చింది "హీరా! హీ-హీ-హీ-హీరా! ఏమిటండీ ఇది 'హీరో'లా వుంది? పిలవటానికికూడా ఎంత కష్టమో చూడండి. హీ-రా! హీ-రా!" అంది నొక్కి నొక్కి పలుకుతూ.

మహీధర్ కూడా నవ్వాడు.

"మరి రెండక్షరాలలో యింతకంటె మంచివి లేవు. మూడక్షరాలలో.. భ్రమర?"

"భ్రమర అంటే నాకు బమ్మెర పోతన జ్ఞాపకం వస్తాడండీ" అంది అదేపనిగా నవ్వుతూ.

"పోనీ-ప్రఫుల్ల-మంచిపేరుకదూ?"

అవిడ చేతులడ్డం పెట్టుకుని నవ్వినంత సేపు నవ్వేక, "ప్రఫుల్ల-పందుంపుల్ల" అంది వెక్కిరింపుగా.

మహీధర్‌కి నవ్వొచ్చినా నవ్వకుండా లిస్టు జేబులో పెట్టేసుకుని "ఏ పేరు చెప్పినా ఏదో వంకలు పెడతావుమరి. నీకేదైనా స్వయంగా ఆలోచిస్తా నుందు" అన్నాడు.

మహీధర్ కాస్సేపు కళ్ళు మూసుకుని ఆలోచన సాగించాడు

"హియర్! హియర్! అబల అంటే అమోఘంగా వుండదూ?" అన్నాడు మహీధర్ సంతోషంగా.

"నయం ఇంకా 'తబలా' అని పెట్టుకోమన్నారు కాదు. ఇంక మీ కవిత్వం కట్టిపెట్టి నన్ను కాస్త ఆలోచించుకోనివ్వండి" అని అవిడ నిశ్చలంగా కూర్చొని ఆలోచించటం మొదలెట్టింది. మహీధర్ మౌనం దాల్చాడు.

మెరుపులా మంచిపేరు తట్టిందావిడకి. ఒక్కసారి ఎగిరి గంతేసింది.

"భలే మంచిపేరు! నా పేరేమిటి చెప్పండి?" అంది అవిడ ఆనందోత్సాహాలతో మెరుస్తున్న కళ్ళని మహీధర్ వైపు తిప్పుతూ.

"అలా తెల్లబోతారేం? నా పేరండీ - మీ రహస్యం ముకుంటారే? అది!" అంది అవిడ అయోమయంగా చూస్తున్న మహీధర్ నుద్దేశించి

"నరసమ్మ-అదేనా?" అన్నాడు మహీధర్ సందేహంగా చూస్తూ.

"అమ్మ ఎందుకూ? 'నరస' అంటురూ."

"'నరస' - అబ్బ' యిదేం బాగుంది! ఇంతా చేస్తే 'అమ్మ' ఒకటి తీసి పారేస్తే తీరిపోతుందనుకుంటున్నావు కాబోలు, ఇన్ని పేరు నచ్చక ఆఖరికి యిదే నచ్చిందీ నీకూ! అదేం వీల్లేదు. ఇక నిన్నెవంకూడా నేనా పేరు భరించలేను" అన్నాడు మహీధర్ చల్లగా చివాట్లు వేస్తూ.

"చక్కటి పేరు ఆలోచించానంట... చెప్పేది వినిపించుకోరేం?" అందావిడ కాస్త విసుగ్గా మొహం పెట్టి

"ఏం పేరు?" అని కుతూహలంగా ముందుకు వంగాడు మహీధర్.

"రసన ఎలా వుంది?" అవిడ కుతూహలముగా మహీధర్‌ని చూసింది.

రసన! మహీధర్‌కి చాలా బాగుంది. అయినా యింతకీ అవిడకి నచ్చింది అంతే చాలు!

"శేష్! ఇంతమంచి పేరెలా తట్టింది నీకూ?" అన్నాడు మహీధర్ అవిడ నభినందిస్తూ.

"ఏంలేదు. నా పేరు 'నరస' లోని 'న' ఆఖరున పెడితేసరి - అందమైన పేరుగా మారింది," అందావిడ విజయగర్వంతో.

"రసనా" అని పిల్చేడు మహీధర్ ముద్దుగా.

రసన అంబాలాలోలికిస్తూ కిలకిలా నవ్వింది.

★